www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, అన్ని రంగాలలో వారు ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని కలెక్టర్ డా.జి. లక్ష్మీ శ అన్నారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఆడపిల్లల పరిరక్షణకై గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం -1994 అంశపై నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలలో పాల్గొని గెలుపొంది జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన మొత్తం తొమ్మిది మంది ప్రభుత్వ పాఠాశాలల పిల్లలకు కలెక్టర్ చేతుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీహరి, జిల్లా విద్యా శాఖ అధికారి వి.శేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని, డిపిఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు.. ఇంతింత కాదయా.!

- నిరసనలతో హోరెత్తిన కలెక్టరేట్
- గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తుల వెల్లువ
- కలెక్టరేట్‌లో స్పందనకు 212అర్జీలు
- చిత్తూరు నగరపాలకకు 4వినతులు
- ఎస్పీ కార్యాలయానికి 18ఫిర్యాదులు

స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న కొల్లాఊరు గ్రామస్తులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో ప్రజలు స్పందన కార్యక్రమంలో విన్నవించుకున్నారు. వారి సమస్యలను వివరిస్తూ.. పరిష్కరించాలని జిల్లా అధికారులను కోరారు. మరో వైపు జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాలు, వివిద సమస్యలతో వచ్చిన ప్రజలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

కలెక్టరేట్ స్పందనకు 212అర్జీలు

స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పథకసంచాలకులు ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందన హాల్‌లో డిప్యూటీ కలెక్టర్ భవాని, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మిప్రసన్నతో కలిసి అర్జీలను స్వీకరించారు. శాఖల వారీగా రెవెన్యూశాఖకు సంబంధించి 156, జిల్లా ఉపాధి కల్పన శాఖ 3, పోలీసుశాఖ 12, విద్యాశాఖ 1, డిఆర్‌డిఏ 2, జిల్లా పంచాయత్ 1, ఎపిఎస్‌పిడిసిఎల్ 5, ఫారెస్ట్‌శాఖ 2, మెప్మా 1, ఎపియంఐపి 1, డియంఅండ్‌హెచ్‌ఓ 1, జిల్లా రిజిస్ట్రార్ 1, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కార్వేటినగరం 1, యల్‌డియం 2, సర్వే 2, పలమనేరు మున్సిపాలిటీ 1, నగర పాలక సంస్థ చిత్తూరు 1, ప్రొబేషనరీ ఎక్సైజ్‌శాఖ 1, నేషనల్ హైవే 1, ఎంపీడీవోలు గంగవరం 1, జిడి నెల్లూరు 1, గుడిపాల 1, హౌసింగ్‌శాఖ 1, ఏపిఎస్‌ఆర్‌టిసి 1, ఇతరులు 12 వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల అర్జీలను అధికారులకు అందజేశారు. ప్రజల నుంచి వినతులకు పరిష్కారం చూపుతామని, ఆ మేరకు అధికారులను ఆదేశించినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు.

నగరపాలక కార్యాలయానికి 4వినతులు

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు వినతులు అందినట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు.. సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం-3, ప్రజారోగ్య విభాగం -1 చొప్పున మొత్తం నాలుగు వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 18 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 18 ఫిర్యాదులు చేరాయి. వాటికి నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ జాషువా ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీని, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్లాని, డి.టి.సి డి.ఎస్పీ శ్రావణ్‌కుమార్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలకు పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మొత్తం 18 ఫిర్యాదులు అందగా భర్త వేదింపులు 2, భూ తగాదాలు 9, ఆస్తి తగాదాలు 3, చీటింగ్ 4 ఉన్నాయి.

ఊరికి దారి కల్పించాలని..

తమ గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం కొల్లాఊరుకు చెందిన గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం అక్కడే నిరసన తెలియజేశారు. జీడీ నెల్లూరు మండలం కుప్రకోన పంచాయితీకి చెందిన కొల్లాఊరు గ్రామానికి దారిలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తమ గ్రామంలో 70కుటుంబాలు నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నదారిలో కూడా పక్కన రైతులు పూర్తిగా కాలిబాట మాత్రం మిగిలిందని ఊరికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే అంబులెన్స్ కూడా సౌకర్యం లేదని వెంటనే తమ బాధలు అర్థం చేసుకొని దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని..

ఏపీ హమాలి ముఠా జట్టు కాలసి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రమాదేవి నాయకత్వంలో హమాలి కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 50కోట్ల మంది అసంఘటిత పనిచేస్తూ ఉన్నారన్నారు. అందులో రాష్ట్రంలో సుమారు 25లక్షలు మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి రాయితీలు సదుపాయాలు అందకపోవడం బాధాకరమన్నారు. హమాలి హెడ్ లోడ్ యాక్ట్ చట్టం కొన్ని రాష్ట్రాల్లో అమలవుతున్నదని మన రాష్ట్రంలో కూడా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు మాదిరిగానే హ మాలి కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా హమాలీ కార్మికులకు వర్తింపజేస్తూ సంవత్సరానికి ఒకసారి ప్రతి జిల్లాలో హెల్త్ క్యాంపులో నిర్వహించాలని హమాలి కార్మికులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికుల హామీలపై జీవో విడుదల చేయాలని..

మున్సిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జీవోను విడుదల చేయాలని సోమవారం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు, ఇంజనీర్ విభాగం కార్మికులు సమస్యల పరిష్కారం కానందున రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడంతో ప్రభుత్వం స్పందించి రాష్ట్ర కార్మిక సంఘం నాయకులను చర్చలు ఆహ్వానించి చర్చించిన తర్వాత ప్రభుత్వం కార్మికులకు కొన్ని హామీలు ఇచ్చి మినిట్స్ ఒప్పందం చేసుకున్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీని జీవో ద్వారా విడుదల చేయడంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఇచ్చిన హామీల మేరకు జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకత్వంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

దళితుల పట్టా భూమిలో శవాలను పూడ్చడం నేరమా..

- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

అనుపుపల్లి సర్వే నంబర్ 167/1దళితులకు సంబంధించిన పట్టా భూమిలో శవాలను పూడ్చడం అన్యాయమని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీహెచ్పీఎస్, డిహెచ్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం, సంబంధిత రెవెన్యూ అధికారులు స్మశాన వాటికలను ఏర్పాటు చేయడంలో మాకు వ్యతిరేకం కాదని జిల్లాలో ప్రతి దళితవాడకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలన్నారు. అందులో మౌలిక వసతులు కల్పించాలని స్మశాన వాటికలో కబ్జా గురికాకుండా ఆక్రమణలకు గురి కాకుండా ప్రహరీ గోడలను నిర్మించాలని కోరుకుంటున్నామన్నారు. కానీ దళితులకు సంబంధించిన పట్టా భూమిలో ఉద్దేశపూర్వకంగా శవాలను వేయడం దీనికి అధికారులు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని సూటిగా ప్రశ్నించారు.

నిరసన వ్యక్తం చేస్తున్న అనుపల్లి దళితులు

హత్య కేసులలో నిందితుల అరెస్టు

- వివాహేతర సంబంధమే కారణమన్న పోలీసులు
- హత్యలో పాత్రదారులైన ఎనిమిది మంది అరెస్ట్
- సీఐని ప్రశంసించిన డీఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి మున్సిపాలిటీ, నెత్తం కండ్రిగ లక్ష్మీపురంలో ఈనెల 3న వాటర్‌ప్లాంట్ యజమాని ఎం.జగదీష్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో నరికి చంపిన కేసును నగరి పోలీసులు 9రోజుల్లో చేధించారు. హత్యలో పాత్రదారులైన నెత్తకండ్రిగకు చెందిన సుధాకర్(40), సత్యవేడు, దాసుకుప్పంకు చెందిన మురళి(37), తిరువళ్లూరు రామదాసుపురంకు చెందిన యస్.మగేష్(40), తిరుపాచూరుకు చెందిన ఎ.అజిత్(27), కడంబత్తూరు అధిగాత్తూరుకు చెందిన హరిహరన్‌కుమార్ అలియాస్ వసంత్(23), సూట్‌సూరి(20) రాజముత్తు(24), మనవాల్‌నగర్‌కు చెందిన జయశంకర్ బాలాజి (24)లను అరెస్ట్ చేశారు. సోమవారం నిందితులను అరెస్టు చూపారు. డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాల మేరకు వివాహేతర సంబంధమే హత్యకు కారణమైంది. ఆ కోణంలోనే సుధాకర్ అనే వ్యక్తిపై అనుమానంతో కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు సోమవారం ఉదయం గుండ్రాజుకుప్పం డంపిగ్ యార్డువద్ద సుధాకర్‌ను అతనితో పాటు ఉన్న ఏడుగురిని అదుపులో తీసుకొని అసలు విషయాన్ని రాబట్టారు. సుధాకర్ అద్దెకున్న ఇంటి యజమాని జగదీష్‌కు వివాహేతర సంబందం ఏర్పడం ఈ కారణంగా వివాదాలు, గొడవలు ఏర్పడి సుధాకర్ భార్యకు విడాకులకు కోర్టును ఆశ్రయించడం జరిగింది. అయినా మానసికంగా జగదీష్‌పై సుధాకర్ కక్షపెంచుకున్నాడు. తనకు వరుసకు సోదరుడైన సత్యవేడు మండలం, దాసుకుప్పం గ్రామానికి చెందిన మురళితో జగదీష్‌ను చంపేందుకు రూ.10లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం మేరకు మురళి తన సన్నిహితుడైన మగేష్ ద్వారా తమిళనాడుకు చెందిన అజిత్, హరిహరన్, వసంత్, సూరి, ముకేష్‌లను రంగంలోకి దింపి హత్యకు పథకరచన చేశాడు. 3వ తేది రాత్రి జగదీష్ కారుదిగి ఇంటికి వెళ్లేసమయంలో అక్కడే పొదల చాటున దాక్కున్న వసంత్ వేటకత్తితో దాడిచేయడంతో జగదీష్ మృతిచెందాడు. విచారణంలో నిందితుల వద్ద నుంచి రూ.1.37లక్షల నగదు, సెల్‌ఫోన్లు, వేటకత్తిని స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరుపరిచారు. కేసును త్వరగా చేధించిన సీఐ సురేష్‌ను డీఎస్పీ ప్రశంసించారు.

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గృహ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి: జేసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, సాంకేతికపరమైన సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందితో పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం జిల్లా సచివాలయం నుండి ఆర్డిఓలు, రిటర్నింగ్ అధికారులు, వైద్యశాఖ అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ కొత్త ఓటు నమోదు, తీసివేతలకు సంబంధించిన క్లైమ్‌ల నివేదికను ఈ నెల 15న రిటర్నింగ్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని, కులగణనకు సంబంధించిన వివరాలను వెంటనే అప్డేట్ చేయాలని తెలిపారు. గృహాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతం చేయించాలని, కొన్ని ప్రాంతాలలో సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయని సమాచారం తెలపడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన బృందం ద్వారా పరిష్కరించుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. రీసర్వేకి సంబంధించిన పనులను వేగవంతం చేసి మూడవ దశ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధించి 69శాతం ఈ-కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు.

ఓటరు నమోదు యాప్‌లపై అవగాహన కల్పించాలి

- డీఆర్‌డీఏ పీడీ తులసి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటు ప్రాధాన్యతపై ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లపై గ్రామీణ ప్రాంతాల్లోనే మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించడానికి స్వయం సహాయక సంఘ సభ్యులు కృషి చేయాలని డిఆర్‌డిఏ పిడి తులసి పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ఆర్థికపరమైన పలు అంశాలపై అవగాహన కలిగిందన్నారు. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ప్రజాస్వామ్య విలువలను పెంచి, ఓటు విలువ దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించడానికి జిల్లాలోని 31మండలాల్లో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఓటర్ల హెల్ప్ లైన్ యాప్, సి.విజిల్‌తో పాటు సాక్ష్యం యాప్‌లపై మండల సమాఖ్యలో ముమ్మర చర్చించే విధంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు. మై ఓట్ మై డ్యూటీ అన్న నిదానంతో గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడం, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకునే విధంగా సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు.

ఆర్గానిక్ కూరగాయలు.. ఆరోగ్యానికి మంచిది

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎలాంటి క్రిమీ సంహారక మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను వినియోగించడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయోస్కరమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను ప్రజల కోసం గత పది వారాలుగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రతి సోమవారం విక్రయిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారుల నుండి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను కొనుగోలు చేసి రైతులకు చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఏ మార్కెటింగ్ ఇంచార్జ్ ఫిజున్నిషా, రైతులు పాల్గొన్నారు.

కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

నగరంలో వీధి కుక్కల కట్టడికి చర్యలు

- 40మందిపై పిచ్చికుక్క దాడి ఘటన బాధాకరం

అధికారులతో చర్చిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరంలో వీధి కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు చెప్పారు. నగరంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 40మంది గాయపడడిన ఘటన దురదష్టకరం.. బాధాకరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం మేయర్ ఛాంబర్‌లో ఎంహెచ్వో డా.లోకేష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్‌లతో సమావేశమై చర్చించారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన ప్రణాళిక సిద్ధం చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల్లో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయడం జరుగుతోందని, కుక్కల జనాభా పెరగకుండా కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు. కుక్కలను నియంత్రించడంలో కొన్ని చట్టపరమైన ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని అధిగమించి తగిన చర్యలు తీసుకొనేలా అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ఆదివారం నాటి ఘటనలోనూ నగరపాలక కమిషనర్, ఇతర అధికారులు వేగంగా స్పందించి చర్యలు తీసుకోవడం జరిగిందని, బాధితులను పరామర్శించినట్లు చెప్పారు. మున్ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు వివరించారు.

బెంచీల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

జిజేఎం ట్రస్ట్‌కి సిమెంటు బెంచీలు, ఇతర వసతులు ఏర్పాటు చేయడానికి హైకోర్టు అనుమతి ఇచ్చిందని జిజేఎం ట్రస్ట్ అధినేత గురుజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.జే.ఎం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్తూరులో వాకర్స్ యొక్క విన్నపాన్ని మన్నించి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. దీనిని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులు అడ్డుకున్నారు. దీనిపైన హైకోర్టుకు వెళ్ళగా జి.జే.ఎం చారిటబుల్ ట్రస్ట్, సిమెంట్ బెంచ్‌లు, ఇతర వసతులు ఏర్పాటు చేసుకునే విధంగా, అనుమతి ఇవ్వవలసిందిగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కి ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ట్రస్ట్ తరఫున ప్రముఖ హైకోర్టు న్యాయవాది దొడ్ల కిషోర్‌కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున గవర్నమెంట్ ప్లీడర్లు హాజరయ్యారు. బెంచీల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి ఇచ్చిన్నట్లు తెలిపారు.

'వీధి కుక్కల భారి నుండి కాపాడాలి'

పజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఆరోగ్య శాఖాధిశాఖ, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సముక్తంగా ప్రజలు వీధి కుక్కల కాటుకు బలి కాకుండా వెంటనే చర్యలు చేపట్టి వీధి కుక్కలు సంచారాన్ని అదుపులో పెట్టాలని మన చిత్తూరు అభివద్ధి వేదిక కన్వీనర్ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. చిత్తూరు నగరంలో వీధి కుక్కల బారిన పడి ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. నగరంలో కుక్కల సంచారాన్ని నియాంత్రించాలని కమిషనర్‌రి వ్రాత పూర్వకం గతంలో పిర్యాదు కూడా చేశామని పేర్కొన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోని కారణంగా ఇలాంటి సంఘటనలో చోటు చేసుకుంటున్నట్లు వివరించారు. వెంటనే చర్యలు తీసుకొని నియంత్రించాలని కోరారు.

ఆశాలను అవమానించడం తగదు

- ఆశాలపై దౌర్జన్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి
- ఆసుపత్రిలో హెచ్ఐవీ పరీక్షలు చేయాలి
- చిత్తూరు హాస్పిటల్ వద్ద నిరసన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆసుపత్రిలో ఆశా కార్మికులను అవమానకరంగా మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఆశా కార్మికులు హాస్పిటల్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా మాట్లాడుతూ బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల, యాదగిరి తదితర ప్రాంతాల నుంచి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి గర్భిణీ స్త్రీలను తీసుకువచ్చి పరీక్షలు చేయిస్తున్న ఆశాలను ఆస్పత్రి సిబ్బంది ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బూతులు తిడుతున్న పరిస్థితి ఉందన్నారు. గర్భిణీ స్త్రీలను దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు చేస్తున్న ఆశాలకు సహకరించాల్సింది పోయి దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చిన వారికి హెచ్ఐవీ టెస్టులు చేయడానికి ఎందుకు తిరస్కరిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆయా పీహెచ్‌సీ పరిధిలో సౌకర్యాలు లేకనే చిత్తూరుకు వారు వస్తారని తెలిపారు. చిత్తూరు ఆసుపత్రి పూర్తిస్థాయిలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వెళ్లిపోవడం వల్లే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ప్రభుత్వం ఇస్తుందా.. లేక అపోలో ఇస్తోందా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వ వేతనాలు పొందుతూ ప్రభుత్వ సేవలు చేయకుండా దౌర్జన్యం చేయడం తగదు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈ పరిస్థితి ఉంటే మిగతా చోట్ల ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆశాల సమస్యలను పరిష్కారం చేయాలని చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం చర్చలు జరిపి అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పినప్పటికీ ఇక్కడ మాత్రం ఇష్టారాజ్యంగా దౌర్జన్యాలకు చేస్తున్నారని వాటిని వెంటనే అరికట్టే విధంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- వాడ గంగరాజు డిమాండ్

చిత్తూరు ఆసుపత్రి కార్పొరేట్ శక్తుల చేతికి వెళ్లిన తర్వాత పేదలకు ఎలాంటి వైద్య సేవలు అందడం లేదని, వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశాల పరిస్థితి ఇలా వుంటే, సామాన్య ప్రజానీకం పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఆశా కార్మికులపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తూ బూతులు తిడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్యాధికారులు వెంటనే స్పందించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్మికులు

నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం పరిశుభ్రత, ఆరోగ్య ప్రాముఖ్యత, అల్బెండజోల్ మాత్రలు , సిరప్‌లపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొని అల్బెండజోల్ మందులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎం. విద్యావతి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ గంగా భవాని, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.అనన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మక విద్యను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన విద్యను అలవర్చుకోవాలని అమరాన్ హాస్పిటల్ అత్యవసర విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ రెడ్డి అన్నారు. సోమవారం ఏ రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో పారామెడికల్ విద్యార్థులకు దాసరి ఆడిటోరియంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ అనే వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. ఈ వర్క్ షాప్ లో పారామెడికల్ విభాగాధిపతి డాక్టర్ మానస్ చక్రవర్తి, ఎం బి యు రిజిస్ట్రర్ ఆచార్య సారథి, డాక్టర్ చంద్రకళాధర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మఠం స్థలంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాంజీ మఠానికి చెందిన స్థలంలో నగరంలోని చిరు వ్యాపారులు అనుమతులు లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకొన్నారని, భవిష్యత్తులో మఠం భూమికి రక్షణ లేకుండా పోతుందనే ఉద్దేశంతో మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు ఆదేశాలతో ఏఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ దుకాణాలను, తడికల షెడ్లను తొలగించారు. తిరుపతి -తిరుచానూరు ప్రధాన మార్గా న్ని ఆనుకుని ఉన్న తిరుపతి పట్టణ లెక్క దాఖల సర్వే నెంబరు 54 లో గల 11 ఎకరాల హథీరాంజీ మఠం భూమి ఉంది. కాగా ఆక్రమణల తొలగింపు సమ యంలో సిపిఐ నాయకులు అక్కడికి చేరుకొని చిరు వ్యాపా రులకు మద్దతుగా నిలి చారు. మఠం భూములు అన్యాక్రాంతం అవుతున్న స్థలా లను గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని డిమాం డ్ చేశారు. ఈ తొలగింపు కార్యక్రమంలో మఠం సిబ్బంది సీతారాం, మధు, తులసి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట గ్రామ పంచాయతీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మేకలత్తూరు లలితా కరుణాకర్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. "ఎన్ఆర్ఐవిపి - పుస్తక మిత్ర "సంస్థ ద్వారా మొత్తం 835 పుస్తకాలను అందించారు. ఈ పుస్తక ప్రదర్శనలో ఉపాధ్యా యులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈసారి ముఖ్యమంత్రి

వైఎస్ షర్మిలానే : చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ షర్మిలానే గెలుపొందు తారని, రాష్ట్రానికి తిరుపతి రాజధాని అవుతుందని కేంద్ర మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం ఎప్పుడో రాజధాని కావాల్సిందని, రాజకీయ పార్టీలు తమ స్వలాభ నిర్ణయాల కోసం చేసిన ప్రయత్నాలలో తిరుపతి రాజధాని కాకుండా పోయిందన్నారు.

తహశీల్దారు అలీఖాన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలోని నూతన తహశీల్దారుగా పిఎండి అలీ ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా చెన్నూరు మండలం నుండి వారు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, రైతుల పట్ల ఇతర ఇతర పనులపై రెవెన్యూ ఆఫీసుకు వచ్చిన వారిని గౌరవంతో పలకరించి వారి సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడును మండలంలో రెవెన్యూ సమస్యలు ఏమిటి? వాటి పరిష్కారాలు ఎలా వున్నాయి?' అని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు గురునాథం, కిరణ్, వీఆర్వో సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అందరూ కలిసి కొత్తగా అలీఖాన్‌ను దుశ్శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

పులివర్తి వినీల్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం:

బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా చంద్రగిరి టిడిపి ఇన్‌ఛార్జి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ సోమవారం కూరపర్తి వారిపల్లి పంచాయతీలో 'మీ ఇంటికి మీ పులివర్తి నాని' కార్యక్రమం నిర్వహించారు. నేడు రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, రౌడీయిజం, ఇసుక, భూ ఆక్రమణలు, ఎర్రచందన స్మగ్లింగ్ తప్ప అభివృద్ధి ఏమీ లేదని ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో పులివర్తి నానిని చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే పేద, బడుగు, బలహీన వర్గాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజీలు, తలకోన ఆలయాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం మరింత అభివృద్ధి చేస్తామని, డీకేటి భూములను రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆదిలక్ష్మి గిరిజన కాలనీ ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం చేసిన పొంగలి, కోడి గుడ్డు కుర్మా రుచి చూచి వాటిపై సలహాలు, సూచనలు ఇచ్చి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు రుచికర, నాణ్యమైన కూరగాయలతో భోజనం పెట్టాలన్నారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబులు పరిశీలించి వాటి పనితీరు గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా తెలిపారు. 10 వతరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

కోట : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని మండల విద్యాశాఖ అధికారి ధారా మస్తానయ్య అన్నారు. సోమవారం కోట మండలంలోని వంజివాక మెయిన్,హెచ్ డబ్ల్యు మండల ప్రజా పరిషత్ స్కూల్ లో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎలా చదువుతున్నారనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్నం మిడ్డే మీల్స్ నిర్వహణ సక్రమంగా ఉందా.. లేదా?' అనే కోణంలో పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, జి పద్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

'కోడ్' కూతకు కొంతే సమయం..

- ప్రారంభోత్సవానికి ఇంకెంత కాలం
- పూర్తైన ప్రభుత్వ భవనాల్లో సేవలకు ఖరారు కాని ముహూర్తం.!

ప్రజాశక్తి-వి.కోట:

ప్రజా ధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు చాలా వరకూ పూర్తైయ్యాయి. ఇప్పటి దాకా సచివాలయాలు వివిధ భవనాల్లో కాలం వెల్లదీస్తూ వచ్చారు. కాగా పూర్తి స్థాయిలో పనులు పూర్తైయినా ప్రారంభోత్సవాలకు నోటుకోలేదు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ తదితర భవనాలు పూర్తి దశకు చేరుకున్నాయి. కాగా అనేక చోట్ల ఇంకా ప్రారంభోత్సవం కాకపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. సార్వత్రిక ఎన్నికల కోడ్ సమయం సమీపిస్తున్న వేళ భవనాలు ఎప్పటికి ప్రారంభమవుతాయోనని పలువురు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అచ్చు పుస్తకాలు సరఫరా చేయాలి

- ఖాళీ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా అచ్చు పుస్తకాలు లేకపోవడం దారుణమని, ఖాళీ లెక్చరర్ పోస్ట్ భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి వినోద్ అన్నారు. సోమవారం కళాశాల పర్యటనలో భాగంగా కాలేజీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రభుత్వం విద్యపై కేంద్రీకరణ పెంచుతున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అది జరగడం లేదన్నారు. పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ కళాశాలపై వివక్ష చూపడం సరైనది కాదన్నారు. విద్యా సంవత్సరం పూర్తి అవుతున్నప్పటికీ విద్యార్థులకు పుస్తకాలు సరఫరా చేయకపోవడం వల్ల విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. దీంతో సక్రమంగా చదవకపోవడం వల్ల ఉన్న లెక్చరర్స్ కూడా విద్యార్థులపై అసహనం వ్యక్తం చేస్తూ కొట్టడం జరుగుతున్నదన్నారు. విద్యార్థులను భౌతికంగా కొట్టడం మానుకోవాలని డిమాండ్ చేశారు. భారతి విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 'చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు' అనే నినాదంతో నిత్యం విద్యార్థులు సమస్యలపై పోరాటం చేస్తున్నదని తెలిపారు. విద్యార్థులు కూడా చదువును నిర్లక్ష్యం చేయకుండా బాగా చదవాలని అదే విధంగా హక్కుల కోసం కూడా పోరాటం చేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కళాశాలలను ఎస్ఎఫ్ఐ పర్యటించి విద్యార్థులు సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులు అందరూ ఎస్ఎఫ్ఐతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

కాపులను విస్మరించడం తగదు

- రాజ్యసభ ఇస్తానని మోసం చేశారు..
- వైసీపీ కార్పొరేటర్లు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గత ఐదేళ్లుగా వైసీపీకి వెన్నుదన్నుగా ఉన్న కాపు సామాజిక వర్గాన్ని విస్మరించడం తగదని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బలిజ సామాజికవర్గ వైసీపీ కార్పొరేటర్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత కార్పొరేటర్లు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 2019లో ప్రస్తుత సీఎం జగన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి 151సీట్లను అప్పగిస్తే 2024లో కాపు సామాజిక వర్గాన్ని విస్మరించడం తగదన్నారు. 72నియోజకవర్గాలలో 20లక్షల మంది కాపు సామాజిక వర్గం ఉన్నారన్నారు. కానీ 47చోట్ల ఒకే సామాజిక వర్గానికి సీటు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చిత్తూరులో 2019లో 44వేల మెజార్టీతో గెలుపొందిన కాపు సామాజిక వర్గాన్ని విస్మరించడం తగునా అని ప్రశ్నించారు. ప్రస్తుతం చిత్తూరులో మరో సామాజిక వర్గానికి ఎమ్మెల్యే సీటును కేటాయించి, కాపు సామాజిక వర్గానికి రాజ్యసభ టికెట్ ఇస్తానని మాట ఇచ్చి సీఎం జగన్మోహన్ రెడ్డి మడమ తిప్పడం పద్ధతి కాదన్నారు. కాపు సామాజిక వర్గాన్ని విస్మరిస్తే మరో కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని మొత్తం జనాభాలో ఒక కోటి జనాభా బలిజ సామాజిక వర్గానిదేనని, అదే విధంగా ఏపీలోని మొత్తం 175అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 70స్థానాల్లో బలిజ సామాజిక వర్గం ఓటర్లే అధికంగా ఉన్న విషయాన్ని సీఎం గమనించాలన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చిత్తూరు అసెంబ్లీ టికెట్ కేటాయించిన సందర్భంగా రానున్న ఎన్నికల్లో రాజ్యసభ సీటును బలిజ కులానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులుకు కేటాయిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఇకనైనా శ్రీనివాసులుకు రాజ్యసభ సీటు కేటాయించేలా తన నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో తమ తదుపరి కార్యాచరణను ప్రకటించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు కోలా కిరణ్, 31డివిజన్ కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, వైసిపి నాయకులు రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న అధికార పార్టీ కాపు కార్పొరేటర్లు

ప్రభుత్వాలు శాశ్వతం కాదు

- టిడిపి నేతలపై రౌడీ షీట్ తెరవడం తగదు
- సయ్యద్ సుహేల్ బాషా

ప్రజాశక్తి-పుంగనూరు:

నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై రౌడీషీట్ ఓపెన్ చేయడం దురదృష్టకరమని ప్రభుత్వాలు ఎప్పటికీ శాశ్వతం కాదని ఆ పార్టీ నాయకుడు సయ్యద్ సుహేల్ బాషా అన్నారు. పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేయడంపై సోమవారం ఓ ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. పుంగనూరు నియోజకవర్గంలో సుమారు 250మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేశారని ఇది పాలకపక్ష కుట్రేనని పేర్కొన్నారు. అర్బన్, రూరల్‌లో కలిసి 20మందిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు వివరించారు. ఇది ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డికి ప్రజల్లోకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి కార్యక్రమానికి పాల్పడుతున్నారు అన్నారు. వస్తువుకి ఎలా ఎక్స్పైరీ డేట్ ఉంటుందో అలాగే మీకు కూడ ఎక్స్పైరీ డేట్ దగ్గర పడిందన్నారు. కేవలం రెండు నెలల్లో మీరు ఓటమి చెందుతారని భయంతోనే టీడీపీ నాయకులపై రౌడీ షీట్ ఓపెన్ చేయించారని ఆరోపించారు. కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయలని చూడడం ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ఎవరు ఉండకూడదని దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇలాంటి కేసులకు మేము అదిరేది, బెదిరేది లేదని మరింత ఉత్సాహంతో ముందుకు వచ్చి టీడీపీ అభ్యర్థిని గెలిపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

'చేతివృత్తులపై అవగాహన ఉండాలి'

ప్రజాశక్తి-రామకుప్పం: విద్యార్థి దశ నుంచినే చేతి వృత్తులపై మక్కువ చూపి, అవగహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామచంద్రన్ పేర్కొన్నారు. సోమవారం వృత్తి విద్యా కమిషన్ ఆదేశాలతో విద్యార్థులకు చేతి వృత్తులపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సచివాలయం, ఆటోమొబైల్స్ వాహనాల ట్రేడింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రామకృష్ణ, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్న కాలనీ' ఆక్రమణపై ఫిర్యాదు

తహశీల్దార్‌కి విన్నవిస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 1061/3లో జగనన్న కాలనీ కోసం రెవిన్యూ అధికారులు గత సంవత్సరంలో స్థలం కేటాయించి పట్టాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు కొంతమంది పునాదులు కూడా వేసుకున్నారు. అయితే ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆ స్థలం వారిదని అడ్డుకోవడంతో లబ్ధిదారులు చేసేది లేక సోమవారం స్థానిక తహశీల్దార్‌కు విన్నవించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం లబ్ధిదారులకు కేటాయించిన స్థలాన్ని ఇప్పుడు అడుక్కోవడం తమదనడం ఆశ్చర్యంగా ఉందని స్థానిక తాసిల్దార్ స్పందించి వెంటనే తమ ఇంటి స్థలాలు తమకు ఇప్పించాలని కోరుచున్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల:

మండలంలోని కలికిరి-కందూరు మార్గంలో సోమవారం పోలీసులు సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేటు పెట్రోల్ బంకు వద్ద ఈ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంటక నరసింహులు మాట్లాడుతూ కందూరు వద్ద చిత్తూరు జిల్లా సరిహద్దు అటు రాయచోటి జిల్లా సరిహద్దు ఉన్న కారణంగా అంతర్ జిల్లా చెక్పోస్ట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టి భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం కందూరులో గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గ్రామాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం మండలంలోని కలిజవేడు పంచాయతీ నాశంపల్లిలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకు, వాటర్‌ప్లాండ్‌ను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ నీలావతి, జైన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ నందనూరు సుబ్రమణ్యం రెడ్డిలను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ప్రజలు సమస్యను తెలుపగా నిధులు మంజూరు చేసి ట్యాంకు నిర్మాణం, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, డీటీ తులసిరామ్, నాయకులు చిన్నమరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, పట్టాభిరెడ్డి, ఏకాంబరం, వెంకటరెడ్డి, మునిరాజారెడ్డి, రూపకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-రామకుప్పం:

గ్రామాల్లో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాజుపేట, చెల్దిగాని పల్లి గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరం గడిచిన వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి నోచుకోలేదన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సిసి రోడ్లు, వీధి దీపాలు, త్రాగు నీరు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతులు కల్పించిందన్నారు. వైసీపీ వారు ప్రశ్నించిన వారి పై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని ఆదరించి చంద్రబాబునాయుడును అఖండ మెజారిటీతో గెలిపించా లన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి నరసింహులు, చిన్నికృష్ణ, చలపతి, మహమ్మద్ రఫీ, వెంకటాచలం, విజయకుమార్ రెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా సూత్రాలు పాటించాలి: ఎంవీఐ

ప్రజాశక్తి-పుంగనూరు: రోడ్డు భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని ఎన్‌విఐ సుప్రియ అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పుంగనూరు ఆర్టీసి డిపో, రవాణా శాఖ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ సుప్రియ మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని లేకుంటే ఇబ్బందులు తప్పవని చెప్పారు. ఆర్టీసీ డిపో నుండి ప్రైవేట్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకరయ్య, డిపో అభివృద్ధి మండలి చైర్మన్ జి.జయరామిరెడ్డి, ట్రాఫిక్ గ్యారేజ్ సూపర్వైజర్లు, డ్రైవర్లు కండక్టర్లు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి



మాజీ మంత్రికి ఘన స్వాగతం పలుకుతున్న శ్రేణులు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని చరకా కాలనీ, విద్యానగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, మిషన్ స్కూల్ వీధి, తపాల మునస్వామి వీధి, జీయప్ప వీధి, మునిపాపన్న వీధి, భజంత్రీ వీధి, గుడియాతం రోడ్డులలో ఆయన పర్యటన సాగింది. టీడీపీ జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వి.బాలాజీ, రామచంద్ర నాయుడు, ఆర్.బి.సి. కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, రమేష్, మోహన, శ్రీనివాసులు, నదీం, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ డ్రైవర్ క్రిందపడి మృతి చెందిన సంఘటన మండలంలోని కూరు మాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప ఇచ్చిన సమాచారం మేరకు.. యాదమరి మండలం గుట్టకిం దఊరు గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ (19) తమ ట్రాక్టర్లో బోడబండ్ల నుండి స్వగ్రామానికి జెల్లీ తరలిస్తూ కూరుమా యపల్లి సమీపంలో అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో ట్రాక్టర్ నుండి అదుపుతప్పి డ్రైవర్ పడిపోయాడు. అతనికి తీవ్ర గా యాలు కాగా సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

బాలుడు అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లి పంచాయతీ ఎర్రగుంతలవారిపల్లె గ్రామానికి చెందిన మధు బాబు అక్క కొడుకు రిషికేశవ(15) పుట్టుకతోనే మూగ చెవుడు కలిగి ఉన్నాడని ఈనెల 9వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద నుండి బయటకు వెళ్లి ఆ తర్వాత తిరిగి రాలేదు. తమ గ్రామం చుట్టుపక్కల ఇతర బంధువుల ఇళ్లలో బాలుడు కోసం వెతికామని ఫలితం లేకపోవడంతో 11వ తేదీ సాయంత్రం ఆదివారం సోమల పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. బాలుడి తల్లి ఎనిమిది సంవత్సరాల క్రితం మృతి చెందగా అక్క కొడుకును తామే పెంచి పోషిస్తునామని బాలుడి ఆచూకీ కనుగొని తమకు అప్పగించి న్యాయం చేయమని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామ సమీప ంలోని సోమేశ్వర స్వామి ఆలయ ప్రక్కన ఉన్న వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన పొలంలో సోమవారం గడ్డివామి దగ్ధమైంది. రైతు కథనం మేరకు.. పొలం పనులు నిమగ్నమై ఉండగా అకస్మాత్తుగా గడ్డివామికి మంటలు వ్యాపించినట్లు చెప్పారు. గుర్తించి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే పూర్తి స్థాయిలో మంటలు చెలరేగి అదుపులోకి రాకపోవడంతో పూర్తి కాలి బూడిదైందని చెప్పారు. పక్కనే ఉన్న ఎదురు కట్టెలు కూడా మంటల్లో తగలబడినట్లు పేర్కొన్నారు. కాగా అగ్ని ఎందుకు వ్యాపించిందనే విషయం అర్థం కాలేదని వివరించారు. పూర్తిగా రూ.60వేల ఆస్తినష్టం కలిగిందన్నారు.

మున్సిపల్ కమిషర్‌గా మంజునాథ్‌గౌడ్

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి మున్సిపల్ కమిషనర్‌గా మంజునాథ్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఉన్న కమిషనర్ దివాకర్‌రెడ్డి బదిలీపై గూడూరు మున్సిపాలిటీకి వెళ్లడంతో నందికొట్కూరు నుంచి మంజునాథ్‌గౌడ్ నగరి మున్సిపాలిటీకి బదిలీపై విచ్చేశారు. మున్సిపాలిటీ సంబంధిత వ్యవహారాలపై చురుకుగా వ్యవహరిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సదుం తహశీల్దార్‌గా నారాయణస్వామి

ప్రజాశక్తి-సదుం: మండల నూతన తహశీల్దార్‌గా టి.నారాయణస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. సదుంలో ఇప్పటి వరకూ పనిచేస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్ కర్నూలు జిల్లా ఆలూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సోమల తహశీల్దారుగా నాగరాజు

ప్రజాశక్తి-సోమల: మండల నూతన తహశీల్దార్‌గా సోమవారం నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుండి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే మండల కేంద్ర మైన సోమలలోని పోలింగ్ కేంద్రాలను, నంజంపేట, పెద్దఉప్పరపల్లి, పేటూరు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి కేంద్రాల వద్ద ఏర్పాటు చేయవలసిన మౌలిక వసతుల గురించి బిఎల్ఓలను అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలను అందజేశారు. కార్యక్రమంలో డిటి శ్యాంప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గంగవరం: విద్యారంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల అమలుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని గంగవరం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ.పి.వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ పలమనేరు డివిజన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024- డైరీలు, కేలండర్‌లను, స్టికర్‌లను అసోసియేషన్ నాయకులతో కలిసి స్థానిక జెడ్పి బాలికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు పుష్పావతి, కోశాధికారి ఏ.ఆర్.కుమార్, హెచ్‌ఎం లత, పలమనేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి రోషన్ ఆలీఖాన్, కార్యదర్శులు సదాశివ వడయార్, రెడ్డిశంకర్, కార్యవర్గ సభ్యులు పద్మ, సులోచన, మునిరత్నం, సుశీల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని కలిసిన జనసేన నేత

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జీడీ నెల్లూరు మండలంలోని బంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఆదివారం హైదరాబాదులో మర్యాద పూర్వకంగా చిరంజీవిని కలిశారు. పద్మ విభూషణ్ అవార్డు వచ్చినందుకు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భక్తులకు సహనంతో సేవలందించాలి : పట్టాభిరామ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఉద్యోగులు సహనంతో సేవలు అందించాలని ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బివి.పట్టాభిరామ్ సూచించారు. తిరుపతిలోని శ్వేత భవనంలో సోమవారం టీటీడీ ఉద్యోగులకు "విధినిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం ఎలా" అనే అంశంపై డాక్టర్ పట్టాభిరామ్ శిక్షణ నిర్వహించారు. టీటీడీ ఉద్యోగులు ఒత్తిడిని అధిగమించేందుకు మన ఆలోచనలను, పని విధానాన్ని మార్చుకోవడం, ఇతరులతో గౌరవప్రదంగా మాట్లాడడం, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవడం, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలు మన ఆధీనంలోనే ఉంటాయన్నారు. ఉద్యోగులకు నైతిక ప్రవర్తన చాలా ముఖ్యమన్నారు. శ్వేత సంచాలకులు భూమన్ మాట్లాడుతూ ఆసక్తి గల ఉద్యోగులు శేషాచలంలోని తీర్థాలను దర్శించుకునేలా త్వరలో ట్రెక్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికష్ణ యాచేంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సీవీఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

సీఎం ప్రజల గుండెల్లో నిలిచిపోతారు: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోతారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కెరోజా అన్నారు. పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్‌పురంలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనంను మంత్రి ప్రారంభించారు. గ్రామాభివృద్ధి చేస్తున్న మంత్రికి స్థానిక మహిళలు గజమాలలతో.సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ. మునివేలమ్మ. వైస్ ఎంపీపీలు. విమలమ్మ. ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్. ఎంపీటీసీలు సర్పంచులు కోఆప్షన్ సభ్యులు, పార్టీ కన్వీనర్ సచివాలయ కన్వీనర్, ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.